అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
బుధవారం 18 జనవరి 2023

పనికి తగ్గ వేతనం చెల్లించాలి: ఏఐటీయూసీ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్



ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలకు పనికి తగ్గ వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బాలరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మెడికల్ సూపరింటెండెంట్ రాజలింగం, స్థానిక అధికారి భోజంగరావుకు వినతిపత్రం అందజేశారు. రెండో ఏఎన్ఎంలకు తీవ్ర మైన పనిభారం మోపుతూ టార్గెట్లు విధుస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆన్‌లైన్ పేరిట సుమారు 16 గంటల పాటు పనిచేయించుకుంటున్నారని, వీరికి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన పైపులు తయారు చేయాలి

నవతెలంగాణ-వర్ని

జాకోర, చందూర్ గ్రామాలలో లిఫ్ట్ ఇరిగేషన్ల నిర్మాణం కోసం సిద్ధం చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. నసురుల్లాబాద్‌లో మంగళవారం పర్యటించి పనులు తనిఖీ చేసినట్టు లక్ష్మీపూర్ సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నాణ్యత కలిగిన పైపులను తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. అధికారులతో ఇరిగేషన్ పైప్ లైన్ ప్లాన్ మార్కింగ్ ను అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ వెంట నర్సింలు, చింతం శ్రీనివాస్, హనుమాన్లు, లింగేశం, చింతం సంజీవులు, చిన్న సాయిలు తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకం.. కంటివెలుగు

- రేపటి నుంచి ప్రారంభించేందుకు సర్వం సిద్ధం
- పీహెచ్సీలకు చేరిన సామగ్రి
- తొలుత ఎంపిక చేసిన గ్రామాల్లోనే క్యాంపులు
- ప్రచారం నామమాత్రం



సాలూర ఆస్పత్రిలో చిన్నగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



సెంటర్‌లకు చేరిన కంటి వైద్య పరికరాలు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కంటివెలుగు-2 ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాలకు వైద్య పరికరాలు చేరాయి. నేడు ఖమ్మంలో సీఎం కేసీఆర్ ప్రారంభించిన మీదట.. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడానికి మండల అధికారులు, వైద్యాధికారులు కార్యచరణ రూపొందించారు. ప్రతి కంటి వెలుగు కేంద్రంలో సుమారు 120 నుంచి 130 వరకు కంటి పరీక్షలు చేయాలని అధికారులు సూచించారు. స్థానిక ప్రజా ప్రతి నిధులను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం సూచించింది. దాంతో ప్రతి మండలంలో ఎంపీడీవోలు, వైద్యాధికారులు కరపత్రాలు ఆవిష్కరణ నిర్వహించడం, వైద్య సిబ్బందికి సూచనలు చేయడం చేస్తున్నారు. అయితే కంటి వెలుగుపై గ్రామాల్లో ప్రచారం కరువైందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన కూడళ్లల్లో ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌లు, బ్యానర్‌లు పెట్టాలని ఆదేశాలు జారీ అయినా క్షేత్రస్థాయిలో సరిపడా సామగ్రి రాకపోవడంతో ప్రచారం అంతంత మాత్రమే అవుతోంది.

పీహెచ్‌సీలకు చేరిన కంటి వెలుగు సామగ్రి..

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయడానికి కావలసిన వైద్య సామగ్రి స్థానిక పీహెచ్సీలకు చేరింది. ప్రతి కేంద్రంలో సిబ్బంది కేటాయింపులు, రోజువారి కంటి పరీక్షల వివరాలను వైద్య సిబ్బందికి అందించారు. 19వ తేదిన బోధన్ నియోజకవర్గంలోని 10 కేంద్రాలలో, డివిజన్ లో 18 కేంద్రాలలో కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నట్లు ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య పేర్కొన్నారు. బోధన్ ఉమ్మడి మండలంలో సాలూర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో 12 రోజులు, సాలంపాడ్ గ్రామ పంచాయతీలో 10 రోజులు, పెగడపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది రోజుల పాటు కంటి వెలుగు పరీక్షలు చేయనున్నారు. నవీపేట్ మండలంలోని నవీపేట్‌లో 45 రోజులు, కమలాపూర్‌లో ఏడు రోజులు, అభంగపట్నంలో 12 రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం చేపట్టనున్నారు. రెంజల్ మండలంలో రెంజల్, నీలా గ్రామంలో రెండు కేంద్రాలలో కంటి వెలుగు చేపడుతున్నారు. ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, కుర్నాపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి కేంద్రంలో కంటి వైద్య నిపుణులతో పాటు సుమారు పదిమంది వరకు వైద్య సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు.

ప్రచారం నామ మాత్రమే...

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, వైద్యాధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు పలు సమావేశాల్లో సూచిస్తూనే ఉన్నారు. కానీ బోధన్ నియోజకవర్గంలో ప్రచారం నామ మాత్రమే అయింది. కంటి వెలుగు నిర్వహించే కేంద్రాలలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వాటి వివరాలు మీడియాకు సైతం నామమాత్రంగానే తెలుపుతున్నారు. ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి టోకెన్లు ఇవ్వడం కూడా 19వ తేదీ నాడే చేస్తారని చెప్తున్నారు. కానీ ముందస్తు ప్రచారం ఎక్కడ కనబడడం లేదు. ప్రభుత్వం నుంచి చిన్న ఫ్లెక్సీ బ్యానర్ తప్ప ఎక్కడ బ్యానర్లపై ప్రచారం చేయడం లేదు. దాంతో ఈ కార్యక్రమం పై కావలసినంత ప్రచారం జరగడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు.

దృష్టిలోపం దూరం చేసేందుకే..

- కంటివెలుగు ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లు పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దృష్టి లోపాలను దూరం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. అట్టహాసంగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. రేపు జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ లోని మహిళా భవనంలో ఉదయం 9.00 గంటలకు కంటి వెలుగు శిబిరాన్ని ముఖ్య అతిథులచే లాంఛనంగా ప్రారంభించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు విస్తృత స్థాయిలో చేపడుతున్న ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అవసరమైన వారికి నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు అందించేలా ప్రణాళికాబద్ధంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, 18 సంవత్సరాలకు పైబడి వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవి, డీ ఎం హెచ్ ఓ డాక్టర్ సుదర్శనం, మెప్మా పీ.డీ రాములు, సీడీపీఓ సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

నవతెలంగాణ-మద్నూర్



మాట్లాడుతున్న ఎస్ఐ

గిఫ్టుల పేరుతో ఫోన్ చేస్తూ నమ్మించి బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును మాయం చేసే మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శివకుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగతనాలు చేసి పట్టుబడుతున్న వాటికి భయపడి దొంగతనాలు తగ్గినప్పటికీ, ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయని, ఫోన్ చేసి ఏదో మాయమాటలు చెప్పి వివరాలు తెలుసుకొని బ్యాంక్ అకౌంట్లో వేల డబ్బులను దోచుకునే మోసగాళ్లను నమ్మవద్దని అవగాహన కల్పించారు.

20న విప్ ఇల్లు ముట్టడి

- మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకుంటే
- రేపటిలోగా కౌన్సిలర్‌లు రాజీనామా చేయాలి
  రైతు ఐక్య కార్యాచరణ కమిటీ



సమావేశమైన రైతులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మాస్టర్‌ప్లాన్ రద్దు చేసేందుకు రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానించాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే 20వ తేదీనా విప్ ఇంటిని ముట్టడిస్తామని స్పష్టంచేశారు. రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పాత రాజంపేట్ గ్రామంలో మంగళవారం రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల రైతులు హాజరై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు చేస్తున్న ఉద్యమం రోజు రోజుకీ ఉధృతం అవుతుందని అన్నారు. గుంట భూమి కూడా రైతులకు నష్టం కలిగించే ప్రసక్తే లేదనీ చెప్తున్న కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే మాట ప్రకారం ఈ నెల 19 వ తేదీ వరకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం పెట్టి మాస్టర్ ప్లాన్ రద్దుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే 19వ తేదీ 3 గంటల వరకు విలీన గ్రామాలకు చెందిన 9 మంది కౌన్సిలర్‌లు రైతులకు మద్దతుగా, మాస్టర్‌ప్లాన్‌కి వ్యతిరేకంగా రాజీనామా చేయాలని అన్నారు. ఒక వేళ ఎవరైనా కౌన్సిలర్‌లు రాజీనామా చేయకపోతే వారిపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని, తమతో కలిసి వచ్చిన కౌన్సిలర్ లతో 19 వ తేదీన 3 గంటలకు కమిషనర్‌కు రాజీనామా ఇస్తామని అన్నారు. సమావేశంలోనే రైతులకు మద్దతుగా కౌన్సిలర్‌లు కాసర్ల శ్రీనివాస్, సుతారీ రవి రాజీనామా పత్రాన్ని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులకు అందజేశారు.

బ్యాంకులో చోరీకి యత్నం

అలారం మోగడంతో పారిపోయిన దుండగుడు

నవతెలంగాణ-బిచ్కుంద



సీసీ ఫుటేజీ..

రాత్రి సమయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు తాళాలు పగలగొట్టి దొంగతనానికి ఓ దుండగుడు ప్రయత్నించగా.. బ్యాంకు సేఫ్టీ అలారం మోగడంతో పారిపోయాడు. ఈ ఘటన బిచ్కుంద మండలంలోని శాంతాపూర్ గ్రామంలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చోటుచేసుకుంది. మంగళవారం వెకువ జామున 3 గంటల సమయంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తి బ్యాంకు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బ్యాంకు డబ్బులు, నగలు, డాక్యుమెంట్లు ఉన్న స్ట్రాంగ్ రూమ్ డోర్ ఓపెన్ చేయగా బ్యాంకులో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ అలారం మోగింది. దీంతో దొంగ పారిపోయాడు. బ్యాంకుకు చేరుకున్న బ్యాంక్ మేనేజర్ లతీఫ్ దొంగతనం సమాచారం పోలీసులకు అందించడంతో బ్యాంకులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిసరాలు పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి ముసుగు ధరించి తన చేతిలో ఉన్న రాడుతో తాళాలు పగలగొట్టిన దృశ్యాలు సిసి ఫుటేజ్ లో రికార్డు అయ్యాయి. బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.

ఏఎన్ఎంలకు పని భారం తగ్గించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన.. వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఏఎన్ఎంలు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ఏఎన్ఎం లకు పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తధానంతరము డీఎంఅండ్‌హెచ్‌వో సూపరింటెండెంట్ రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ యూపీ హెచ్సి అండ్ (పీహెచ్‌సీ) కేటగిరీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎం లందరిని పర్మెంట్ చేయాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అధిక పనిభారం మోపుతూ అందుకు తగ్గట్టు వేతనాలు ఇవ్వడం లేదని, వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. రెండవ దశ కంటి వెలుగులో అయినా ప్రభుత్వం తీసుకొచ్చిన ఏ సంక్షేమ పథకాలైనా వీరితో చేయించరాదని, దీనికి సంబంధించిన ఒకరిని ప్రత్యేకంగా కేటాయించి డాటా ఎంట్రీ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్యక్రమానికి 32 రిజిస్టర్లు రాయవాల్సి వస్తుందని, అలా చేయడం వలన పని భారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్టు తెలిపారు. ఏఎన్ఎంలకు అదనపు ఇంటి భత్యం పునరుద్ధరించాలని, సొంత వాహనాలపై మరు మూల ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలకు పెట్రోల్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. వారి న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే రాజనర్సు, ఏఎన్ఎం జిల్లా నాయకులు లక్ష్మి, దీవెన, కవిత, డి లక్ష్మి, జి రేణుక, రాజనీత, కే.రేణుక, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితో ఎన్నో సంక్షేమ పథకాలు

- ఆడపడుచుల వద్ద 'లక్ష్మి' నిలకడగా ఉంటుంది
- నియోజకవర్గంలో గుంట భూమి ఎండనివ్వబోం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నూతన స్కూల్ బిల్డింగ్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

నవతెలంగాణ-వర్ని

సీఎం కేసీఆర్ కృషితో భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో మాత్రమే ఉన్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పొట్టి గుట్ట తండాలో ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. తదుపరి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్యాణ, లక్ష్మి షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా సంక్షేమ పథకాలతో రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో డబ్బులు అందిస్తున్నామని అన్నారు. మగవారి జేబులో డబ్బులు ఉంటే వ్యర్థంగా ఖర్చు చేస్తారని ప్రభుత్వం ఇచ్చే డబ్బులు అని గుర్తుండాలంటే ఇంట్లో ఆడవారికి ఖాతాలలో ఉంచితే లక్ష్మీ నిలకడగా ఉంటుందని అన్నారు. తండాలో పలు సంక్షేమ పథకాలకు త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో పనిచేసే ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు రాష్ట్రం ఆరోగ్యంగా ఉంచే బాధ్యత వారి చేతిలో ఉందన్నా రు. గ్రామాలలో ఉండే గర్భిణులకు అంగన్వాడి సెంటర్లో కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కానీ తల్లి బిడ్డలకు సరిపడు పౌష్టిక ఆహారం అందిం చినట్లయితే ఎలాంటి రోగాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆరో గ్యంగా ఉంటే ఆస్పత్రులే అవసరం ఉండదని చెప్పారు.

ముఖ్యమంత్రి కృషితో బాన్సువాడ నియోజకవర్గంలోని నిజాంసాగర్ ఆయకట్టు కింద లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. రూ.1.20 కోట్లతో జాకోర చందూర్ గ్రామాలలో లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా నీరు అందని పలు గ్రామాలకు వేసవికాలంలో కూడా పంట పండించుకునే విధంగా నీరును అందేలా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ నెల 19 నుంచి ప్రతి గ్రామంలో కొనసాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయ వంతం చేసే బాధ్యత సర్పంచులది, కార్యదర్శుల దేనని అన్నారు.

తండాకు చెందిన విద్యార్థిని ఎంబీబీఎస్ చేస్తున్నందున.. విద్యార్థికి సహాయ సహకారాలు అందజేస్తానని, ఎంబీబీఎస్ పూర్తి చేసి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పౌష్టిక ఆహారాలతో న్యూట్రీషన్ కిట్‌లు అందజేస్తుందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఎంపిక చేసిన 9 జిల్లాల్లో అందజేస్తుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆరోగ్య జిల్లాగా ఉండడంతో న్యూట్రిషన్ కిట్లు జిల్లాకు రాలేదని అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి నిజామాబాద్ జిల్లాకు న్యూట్రిషన్ కిట్లు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హరిదాస్, వైస్ ఎంపీపీ గండ్ల బాలరాజు, ఏఎంసి వైస్ చైర్మన్ గోపాల్, మూడ్ అంబర్ సింగ్, మండల అధ్యక్షులు కలాల్ గిరి, పిఏస్ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, నామాల సాయిబాబా, సర్పంచుల అధ్యక్షులు సత్తిబాబు, పద్మ, కో ఆప్షన్ నెంబర్ కరీం, శోభ యోగేష్, ఎంపీడీవో బషీరుద్దీన్, తహసీల్దార్ విట్టల్, హౌసింగ్ ఏఈ నగేశ్, పంచాయతీరాజ్ ఏఈ గంగా కిరణ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా తయారు చేయాలి

- డీఎల్‌పీఓ సురేందర్



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ పరిధిలోని సంబంధిత కార్యదర్శులు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా ప్రణాళికను తయారు చేయాలని ఎల్లారెడ్డి డీఎల్పీఓ సురేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి మండలాలకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గానూ గ్రామ పంచాయతీలోని కార్యదర్శులు గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత పరంగా పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్ చారి, ఎల్లారెడ్డి ఎంపీఓ ప్రకాష్, నాగిరెడ్డిపేట ఎంపీఓ శ్రీనివాస్, గాంధారి ఎంపీఓ పాల్గొన్నారు.

జోన్‌ల పేరుతో కంపెనీలకు భూములు కట్టబెట్టే యత్నం

- మాస్టర్ ప్లాన్ రద్దు చేయాల్సిందే
- ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి
- ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చేయాలంటే ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భూములు చూపిస్తామని వెల్లడి



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


భూ సేకరణ చట్టం-2013 ప్రకారం భూములు సేకరించేందుకు 80 శాతం మంది రైతులు అంగీకరించాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రకరకాల జోన్‌ల పేరుతో రైతులను ఇక్కట్లు పెట్టి వారి భూములు లాక్కొని కంపెనీలకు కట్టబెడుతోందని ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. దాంట్లో భాగంగానే కామారెడ్డి, జగిత్యాలలో మొదటి విడుతగా అమలు చేసేందుకు యత్నిస్తుందని చెప్పారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పాతం రాజంపేట్‌లో సమావేశం కాగా.. ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి హాజరై మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..

రైతు ఆత్మహత్యాయత్నం

- మాస్టర్‌ప్లాన్‌తో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రైతుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఇప్పటికే సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు పయ్యావుల రాములు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే మరొక రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మర్రిపల్లి బాలకృష్ణ పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా.. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

వివరాలు మెయిన్‌లో..

దాడి చేసిన గుండాలను అరెస్ట్ చేయాలి

- కేసు పెట్టినా పట్టించుకోని పోలీసులను సస్పెండ్ చేయాలి
- మల్లికార్జున్‌పై దాడిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన సీఐటీయూ నాయకులు

వివరాలు మెయిన్‌లో..

వరి పంట పరిశీలన

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కొండూరు, పోత్నూర్ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మంగళవారం వరి పంటలను పరిశీలించారు. రైతులు వరి పైరు లో మొగిపురుగు, ఆకు ముడత తెగులు గమనించినప్పుడు నాటిన 20 రోజుల్లో ఎకరానికి కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు ఒక ఎకరానికి లేదా క్లోరాంతనిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు ఒక ఎకరానికి వాడాలన్నారు. అగ్గితెగులు గమనిస్తే ట్రైసైక్లజోన్ 120 గ్రాములు ఎకరానికి లేదా ఐసోప్రినలైన్ 300 ఎంఎల్ ఒక ఎకరానికి వాడాలని రైతులకు తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలతో పురుగు మందులు వాడాలని ఏఓ వెంకటేష్ కోరారు. వ్యవసాయ అధికారి వెంకటేష్ రైతులకు అందుబాటులో ఉండి సూచన చేస్తున్నందుకు కొండూర్ రైతు అన్నం హరీష్ అభినందనలు తెలిపారు.

ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-భీంగల్

పట్టణంలోని నాల్గవ వార్డులో సంక్రాంతి పండగను పురస్కరించు జిని వైస్ చైర్మన్ గున్నాల బాలభాగత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాలుగు వార్డు ప్రజలు యూత్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగులో పరీక్షలు చేయించుకోవాలి

- ప్రజలకు అధికారుల సూచన
- రేపటి నుండి ప్రారంభం.. ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-విలేకరులబృందం

భీంగల్ : కంటి వెలుగులో డాక్టర్లు సున్నితమైన సేవలు అందించాలని ప్రత్యేకాదికారి దుర్గప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని బెజ్జోర, బాబాపూర్ గ్రామాలలో కంటి వెలుగు శిబిరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి బాగం చాలా సున్నితమైనదని, శిబిరానికి వచ్చే వారికి సున్నితంగా వైద్యం అందించాలని తెలిపారు. ఈయన వెంట యంపిడివో రాజేశ్వర్, యంపివో గంగమోహన్, డాక్టర్ అజయ్‌పవర్, సర్పంచ్ కోగూరు ప్రతిభ సుమన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు

మోర్తాడ్: నేటి నుండి మండలంలో విడుతల వారీగా కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల18నుండి మే 30వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో కంటి వెలుగు ఏర్పాట్లను కార్యక్రమ ప్రత్యేక అధికారి డాక్టర్ అశోక్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేస్తున్న శిబిరం, ఏర్పాట్లు, సౌకర్యాలు, తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. స్థానిక వైద్యుడు స్వామి, సిబ్బంది మారుతి, మహేందర్ కృష్ణవేణి, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ టీచర్లతో చర్చించారు.ఈ సందర్భంగా సలహాలు, సూచనలు చేశారు.

మోపాల్: మండలంలోని న్యాల్కల్ గ్రామంలో సర్పంచ్ గంగా ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించారు. ప్రతి ఒక్కరు సంబంధించిన కంటి సమస్యలున్నవారు కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాన్నారు. కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లింగ ఏపీఎం మోహన్, ఐకేపీ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఆశావర్కర్లు, ఉప సర్పంచ్ సతీశ్, సొసైటీ చైర్మెన్ ఉమాపతి, వార్డు సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు

ఏర్గట్ల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈ నెల 18 నుండి ప్రారంభం కానుందని ఏర్గట్ల మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 19 నుండి ఫిబ్రవరి 17 వరకు, బట్టాపూర్‌లో ఫిబ్రవరి 20 నుండి 28 వరకు, దోంచందలో మార్చ్ 1 నుండి 10 వరకు, నాగేంద్రనగర్‌లో మార్చ్ 13 నుండి 15 వరకు కంటి పరీక్షలు ఉంటాయని అన్నారు. గుమ్మిర్యాల్ లో మార్చ్ 16 నుండి 27 వరకు, తడపాకల్ లో మార్చ్ 28 నుండి ఏప్రిల్ 11 వరకు, తొర్తిలో ఏప్రిల్ 12 నుండి 24 వరకు, తాళ్ళ రాంపూర్‌లో ఏప్రిల్ 25 నుండి మే 9 వరకు కంటి పరీక్షలు చేస్తారని ఆమె తెలిపారు.



భీంగల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారి

ఆర్మూర్ : కంటి వెలుగు ప్రారంభోత్సవ కార్యక్రమం దేగాం మచ్చర్ల గ్రామాల్లో ఈనెల 19న ప్రారంభిస్తున్న టు ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీపీ పస్కా నర్సయ్య మంగళవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

డిచ్‌పల్లి: మండలంలోని బీబీ పూర్, ధర్మారం బి, గొల్లపల్లిలో గురువారం నుండి కంటి వెలుగు కార్యక్రమం మొదలవుతుందని ఎంపీడీవో గోపి బాబు, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ తెలిపారు. గ్రామపంచాయతీలలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. కంటి శిబిరంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు .సమయానుసారం వచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరాలను బట్టి టెంట్లను వేయాలని పంచాయతీ సిబ్బందిని ఎంపిడిఓ గోపిబాబు ఆదేశించారు. అంతకుముందు గ్రామంలో దండోరాచేయించి గ్రామస్తులకు కంటి శిబిరాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో సూపర్వైజర్ అక్బర్ అలీ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మోపాల్‌లో గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న అధికారి

19న వాహనాల వేలం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిద కేసుల్లో పట్టుబడిన (03) వాహనాలకు ఈనెల 19న వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలోగల కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వ్యక్తులు వేలంపాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బీడీకార్మికులకు ఆసరా పెన్షన్ ఇవ్వాలి

ఐఎఫ్‌టీయూ డిమాండ్.. ర్యాలీ, ధర్నా, ఎంపీడీవోకు వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీడీలు చేసే ప్రతి కార్మికురాలికి ఆసరా పెన్షన్ ఇవ్వాలని బీడీ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో లక్ష్మణ్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్తెన్న, అరవింద్, తదితరులు పాల్గొన్నారు

మతోన్మాదంపై పోరాడిన వ్యక్తి.. జ్యోతి బసు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు



జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మతోన్మాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన వ్యక్తి జ్యోతిబసు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. సీపీఐ(ఎం) అగ్ర నాయకుల్లో ఒకరైన జ్యోతి బసు 12వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరుగా ఉండి శ్రామిక వర్గ ఐక్యతకు, ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేసిన వ్యక్తి జ్యోతి బస్ అని అన్నారు. 35 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పరిపాలన కొనసాగించారన్నారు. నేడు మతోన్మాదం తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలను సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఐక్యతను కాపాడటం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మిన వ్యక్తి జ్యోతిబసుఅని అన్నారు. ఆయన ఆశయ సాధనకు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, కే గంగాధర్, నన్నేసాబ్, ఎం గోవర్ధన్, టి కృష్ణ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిపై దాడి చేసి అవమానపరిచిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటగిరి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై కొందరు బిజెపి బజరంగ్‌దళ్ కార్యకర్తల చేసిన దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాలుగు నెలల కింద చందా ఇవ్వలేదని కొందరు మతోన్మాదులు కక్షతో ఉపాధ్యాయుని పాఠశాల నుండి నడి ఊర్లో నుంచి ఊరేగింపుగా గుడిలోకి తీసుకెళ్లి ఉపాధ్యాయునికి బొట్టు పెట్టి క్షమాపణ చెప్పించి అవమాన పరచారిచారన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం మే తక్షణం స్పందించి మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు తప్పవన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు శివరాజ్, గంగారాం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంచుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 23న జిల్లా కేంద్రంలోని వీర బ్రహ్మేంద్రస్వామి, మాత గోవింద మాంబ సమేత కళ్యాణ మహోత్సవంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కత్రాజీ రాజేశ్వర్, పడకంటి భానులు మంగళవారం తెలిపారు. ఈమేరకు మంగళవారం సంబంధిత కరపత్రాల పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం జిల్లా నగర కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం న్యాలకల్ రోడ్డు లోని ఆర్ఎస్ ఫంక్షన్ హాలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అన్నారు. పంపిణీలో వీరాచారి, బొమ్మెన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా పోలీసు కమిషనర్ కార్యాలయంలో బిసి ఉపాధ్యాయ సంఘం వాల్ క్యాలెండర్ ను పోలీసు కమిషనర్ నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. బీసీటీయూ సావిత్రి బాయిఫూలే జయంతిని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షులు కొట్టూరు రమేష్, ఉపాధ్యక్షులు మహేందర్, బిసిటియు మహిళా అధ్యక్షురాలు నునుగొండ విజయలక్ష్మి, డిచ్‌పల్లి మండలం అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ, రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, రఘువీర్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆదాయపుపన్ను మినహాయించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసి రిటైర్ అయిన పెన్షనర్లకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాబోయే బడ్జెట్ సమావేశంలో ఆ మేరకు మినహాయింపు ప్రతిపాదనను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కుటుంబం బతకటానికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌పైన ఆదాయం పన్నును విధించటం అన్యాయమని వారన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపు పన్ను పరిమితిని పది లక్షలకు పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఈ బడ్జెట్లో సంతోషకరమైన వార్తలు ఉంటాయని ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించిన నేపథ్యంలో పెన్షనర్లకు , మధ్యతరగతి ఉద్యోగులకు ఈ చిరు కోరికను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్రావు ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, నిర్వాహక కార్యదర్శి ఎస్. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వేముల సురేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం విరాళం



విరాళం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర సందర్భంగా రథోత్సవం నిర్వహించే నూతన రథం కోసం మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు విరాళాలు అందజేశారు. ప్రస్తుతం ఉన్న రథం శిథిలావస్థకు చేరడంతో గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలోనూతన రథ నిర్మాణానికి సంకల్పించారు. అందులో భాగంగా రైతు నాయకుడు వేములసురేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం బీఆర్ఎస్ నాయకులు బద్దం రాజశేఖర్, తీగల హరీష్ రూ.10వేల చొప్పున విరాళం అందించారు.ఈ మేరకు విరాళం మొత్తం రూ.20వేలను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, బిఆర్ఎస్ నాయకుడు సుంకరి మురళి, పార్శపు జైపాల్ రెడ్డి, పెంట కిషన్, గోపిడి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

స్వర్గరథం దాతకు ఘనసన్మానం



దాత తల్లిదండ్రులను సన్మానిస్తున్న సర్పంచ్, వీడీసి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పందిమడుగు గ్రామ పరిధిలోని బాసునూతి తాండా వాసి పూల్ సింగ్ అమెరికాలో స్థిరపడి గ్రామానికి స్వర్గరథం విరాళంగా అందజేశారు. దీతో మంగళవారం ఆయన తండ్రి రూప్ సింగ్, తల్లి లక్ష్మీలను సర్పంచ్ సర్దన్ భాగ్యలక్ష్మి గంగానర్సయ్య, వార్డు సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పూల్ సింగ్‌ను అభినందించారు. అనంతరం సంక్రాంత్రి పండగ సందర్భంగా నిర్వహించిన నాలుగు గ్రామాల ముగ్గుల పోటీలలో గ్రామానికి చెందిన యువతులు మొదటి బహుమతి గెలుపొందటంతో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేష్,కారొబార్ ధర్మపురి, యువకులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

జీవో నెంబర్ 16 లో చేర్చి రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు పి.నర్సింగ్ రావు అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి. డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో ఇంచార్జ్ ఏవో గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐ టీయూసీ జిల్లా అధ్యక్షులు పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంఆజి బేసిక్ పేఅమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఏఎన్ఎం లకు టీఏ, డీఏలు ఇవ్వాలని రెండో ఏఎన్ఎంలకు 35 రోజులు ఐచ్చిక సెలవుల తోపాటు ప్రసూతి సెలవులు 180 రోజులు ఇవ్వాలని, రొటీన్ ఇమ్యునైజెషన్ సంబంధించిన అలవెన్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. రొటీన్ వాక్సినేషన్ రవాణాకు ఖర్చులు సుమారు నెలకు 5000 రూపాయలు రవాణా బత్యం కింద ఇవ్వాలని, ప్రతి రెండవ ఏఎన్ఎంకు 36 రిజిస్టర్లు, ఆన్లైన్ అండ్ ఆఫ్ లైన్‌కు సుమారు 2500 ఖర్చు అవుతున్నందునా వీటిని వెంటనే చెల్లించాలని తెలిపారు. బదిలీలకు అర్జీలు పెట్టుకున్న వాళ్లకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు హనుమాన్లు, రమేష్, ఏఎన్ఎం నాయకులు కమల, మమత, శ్యామల కుమారి, పద్మ తదితరులు అధిక సంఖ్యలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులకు ఇచ్చిన.. వచ్చిన ధాన్యంపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

- నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కలెక్టర్ ఏ రైస్ మిల్లుకు ఎంత ధాన్యాన్ని కేటాయించారో... తిరిగి వాళ్ల బియ్యాన్ని ఎంత ఇచ్చారో అనేది శ్వేత పత్రం విడుదల చేయాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మానాల మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఈనెల 13న బోధన్ ఎమ్మెల్యేకు సంబంధించిన రైస్ మిల్లులో జరిగిన అవినీతిపై జిల్లా అధికారిపైన ఆరోపణలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే అధికారికంగా నాలుగు రైస్ మిల్లులను నడుపుతూ బినామీల పేరుతో పది రైస్‌మిల్లులను లీజుకు తీసుకొని, అందులో కొన్నింటికి సరైన యంత్రాలు లేకుండానే నడుపుతున్నారని ఆరోపించారు. అవినీతి అధికారి ఎమ్మెల్యే రైస్ మిల్లులకు 5,22,344 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించారని తెలిపారు.మూడు సంవత్సరాలుగా ఎమ్మెల్యే రైస్ మిల్లులకు కేటాయించిన వడ్లను బియ్యంగా చేసి తిరిగి ఇవ్వకుండా మహారాష్ట్రకు విక్రయించి సుమారు వంద కోట్ల అవినీతికి పాల్పడ్డాడని అన్నారు. 1,48,502 క్వింటాళ్ల ధాన్యాన్ని కేవలం ఎమ్మెల్యే షకీల్‌కు సంబంధించిన నాలుగు రైస్ మిల్లకే కేటాయించారని, టీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్న రైస్ మిల్లర్లు కూడా ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. అవినీతి ఆరోపణ వచ్చిన అధికారిని రైస్ మిల్లులపై తనిఖీ చేయడానికి పంపడం అనేది ఎంతవరకు సరైనదో కలెక్టర్ సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు.



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే, అధికారి కలిసి చేసిన అవినీతిపై అదే అధికారిలో విచారణ చేయించడం ఏంటో చెప్పాలన్నారు. ఆరు సంవత్సరాలుగా జిల్లాలో డీఎస్‌వో ఒక సహకార అధికారి కలిసి బహిరంగంగానే రైస్ మిల్లర్ దగ్గర డబ్బులు వసూలు చేస్తూ జిల్లా ఎమ్మెల్యేలకు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటన ఇవ్వకముందే తనపై క్లీన్ షీట్ ఇచ్చారని ఎమ్మెల్యే ఏ విధంగా ప్రకటన విడుదల చేశారో చెప్పాల్సిన బాధ్యత జిల్లా అధికారులపైన, కలెక్టర్‌పైన ఉందని ఆయన అన్నారు. కావున రైస్ మిల్లులో జరిగిన బియ్యం బ్లాక్ అవినీతిపై ఉన్నత స్థాయి కమిటీ ద్వారా గాని, సీబీసీఐడీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కలెక్టర్ చర్యలు తీసుకోకపోతే గురువారం డీఎస్ఓ ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు రాజా నరేంద్ర గౌడ్, జిల్లా ప్రభగండ కమిటీ చైర్మన్ జావిద్ అక్రమ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, డిసిసి డెలిగేట్ ప్రమోద్ క్లైసర్, నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

ఘరానా మోసగాళ్లను కాపాడుతున్నది ఎవరు?

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ లో ఉద్యోగాల పేరుతో కోట్లు వసూలు చేసిన ఘరానా మోసగాళ్లను కాపాడుతున్నది ఎవరని మై గ్రాండ్స్ రైట్స్ వెల్ఫేర్ అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో వందలాది మందిని మోసగించి, కోట్ల రూపాయలు దండు కొన్న గల్ఫ్ ఏజెంట్లు చిక్కెల స్వామి కేఎస్ ట్రావెల్స్ పేరుతో నిజామాబాద్‌లో, షేక్ బషీర్ ఆర్‌కే ట్రావెల్స్ పేరుతో డిచ్‌పల్లిలో ఆఫీసులు పెట్టారన్నారు. స్వామి 300 మంది దగ్గర ఒక్కొక్కరి నుంచి 80 నుండి 90 వేలు, బషీర్ 20 వేల నుండి 60 వేల వరకు 500 మంది దగ్గర వసూలు చేసి పరార్ అయ్యారని తెలిపారు. బాధితులు స్థానిక పోలీసులకు, సిపి నాగరాజు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారని అన్నారు. మంత్రి సీపీతో మాట్లాడి బాధ్యులను అరెస్టు చేసి పీడీ యాక్ట్ కింద అదుపులోకి తీసుకొని బాధితులకు వారు చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాల్సిందిగా ఆదేశించి పది రోజుల గడిచినప్పటికీ నిందితులపై చర్యలు అంతంత మాత్రమే తీసుకొన్నారని అన్నారు. ఇంకొక వ్యక్తి విజయ శ్రీ డయాగ్నొస్టిక్ పేరుతో నిజామాబాద్ ఖలీల్‌వాడిలో దుకాణం పెట్టి 600 తీసుకొని మెడికల్ టెస్ట్ చేయాల్సిన చోట 5,600 చొప్పున 500 మంది దగ్గర సుమారుగా 30 లక్షలు వసూలు చేశాడని తెలిపారు. ఆయనకు " గమ్ కా " మెడికల్ లైసెన్స్ కూడా లేదని, ఏజెంట్లు బషీర్, స్వామిలతో కుమ్మక్కై అమాయకులను మోసగించాడని బాధితులు ఆయన దుకాణం ముందు ధర్నా చేసి డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ లో సీపీ నాగరాజుకు ఫిర్యాదు చేశారన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయవాది బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడిపట్ల ఖండన



నవతెలంగాణ-వర్ని

కోటగిరి మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మల్లికార్జున అనే ఉపాధ్యాయునిపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ వారు చేసిన దాడిని ఖండిస్తూ వర్ని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎ) ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ.. ఇది ఉపాధ్యాయుడిపై జరిగిన దాడి కాదని.. రాజ్యాంగంపై జరిగిన దాడి అని అన్నారు. దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు.

20న వాహనాల వేలం

నవతెలంగాణ-బోధన్

ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న వాహనాలను ఈ నెల 20వ తేదీన శుక్రవారం రాకాసిపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 16 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

దేశీదారు, మద్యం పట్టివేత..

బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామ సమీపంలో మంగళవారం ఓ వ్యక్తి మహారాష్ట్ర నుంచి నిషేధిత దేశీదారు మద్యం తరలిస్తుండగా నిఘావేసి పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ రూప్ సింగ్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి నుంచి 120 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వంట సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసే గంగమ్మకు మద్నూర్ మండల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వంట సామగ్రిని రెడ్‌క్రాస్ మండల అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో ఎస్ఐ శివకుమార్ చేతుల మీదుగా స్వీపర్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ.. మండల రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పేద వారి కోసం ఉచితంగా వంట సామగ్రి అందించడం పట్ల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులను ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సీబీఈ చిన్నారి పిల్లలకు పుట్టినరోజు వేడుకల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్ర టీచర్, చెంపబాయి మాట్లాడుతూ.. పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో సీబీఈ పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కవిత, ఆ కేంద్ర వార్డు మెంబర్ ఎండీ ఇక్బాల్, అంగన్వాడీ కేంద్రం టీచర్ కళావతి, అంగన్వాడీ ఆయా సంగీత తదితరులు పాల్గొన్నారు.

30వ రోజు చేరిన రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 30వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో న్యాయవాదులు ఎమ్.డి.అజర్ అహ్మద్, దత్తాత్రి కులకర్ణి, విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు. కాగా ఈ దీక్షలను బోధన్ కమ్మ సంఘం అధ్యక్షులు పలేం పాటి శివనారాయణ, బీజేపీ నాయకులు రంగారావు ప్రారంభించారు. శిబిరంలో శివనారాయణ మాట్లాడుతూ.. బోధన్‌ను జిల్లాగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని అన్నారు. న్యాయవాదులు చేపట్టిన ఉద్యమానికి తమ పూర్తి మద్దతు, సహకారం ఉంటుందని ప్రకటించారు. దీక్షలో తాము కూడా త్వరలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డ మూడి వెంకటేశ్వరరావు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది దినేష్ పాటిల్ సంఘీబావం తెలిపారు.

కాండం తొలుచు పురుగు నుంచి రక్షణా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

వరి పంటకు ప్రస్తుతం కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని మండలంలోని రామేశ్వర్ పల్లి వ్యవసాయ విస్తీర్ణ అధికారి అఖిలేష్ రైతులకు సూచించారు. మంగళవారం గ్రామ శివారులో వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు వరి పంటకు ఏదైనా చీడ తగిలితే స్థానిక వ్యవసాయ అధికారులకు వివరించాలని, రైతులు పంటలో జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

చెరువు కట్ట పరిశీలన


చెరువు కట్టను పరిశీలిస్తున్న ఆనంద్‌గౌడ్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో నాగప్ప చెరువు కట్టను సబ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆనందం ఫిర్యాదు మేరకు కాచాపూర్ గ్రామానికి చెందిన చంద్రగౌడ్ నాగప్ప చెరువు కట్టను అక్రమంగా తీసివేసి కట్ట కింద ఉన్న కాలువను పూడ్చివేశాడని, దీనివలన చెరువు కట్టకు సుమారు రూ.20వేల నష్టం వాటిల్లిందని తెలుపడంతో చెరువు కట్టని పరిశీలించినట్టు తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫిర్యాదు మేరకు అక్రమంగా చెరువు కట్టను తొలగించిన చంద్రగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మురికి కాల్వలకు అడ్డంగా గల రోడ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో మురికి కాలువలకు అడ్డంగా ఉన్న వాటి వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు పంచాయతీ సెక్రెటరీ యాదగిరి తెలిపారు. మంగళవారం మండల కేంద్ర పంచాయతీ పరిధిలోని బోయవాడలో మురికి కాల్వలపై అడ్డంగా గల రోడ్లకు సిమెంట్ పైపులు బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని గల్లీలలో అడ్డంగా ఉన్న రోడ్లతో నివాస గృహాల ప్రజలు మురికి నీటి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులతో రోడ్డును తవ్వించి సిమెంట్ పైపులను బిగించినట్టు తెలిపారు. అనంతరం మురికి కాలువలను శుభ్రం చేసినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/మద్నూర్


పెద్దకొడప్‌గల్ : విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా శిలాఫలకాన్ని ప్రారంభించి అనంతరం జెండాను ఎగురవేశారు. డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. బాల్యం నుంచి వివక్షను ఎదుర్కొంటూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. సమాజంలో అస్పృశ్యతను నివారించడం నుంచి మానవ సమాజాన్ని సమైక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహా నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని, ఉన్నత స్థాయిలో ఉండి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా కన్న తల్లిదండ్రులను ఎప్పుడు కూడా ఆ గౌరవ పరచవద్దని, వారిని ఎల్లప్పుడూ గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి బిడ్డలపై ఉందని ఆయన అన్నారు. తల్లిదండ్రులు మనకు ఏమి చేశారో అని కాకుండా మనం కన్నా తల్లిదండ్రులకు సేవ చేసి వాళ్ల రుణం తీర్చుకోవాలని అన్నారు.

అదేవిధంగా నూతన మండలం ఏర్పడిన తర్వాత గ్రామంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని తెలిపారు. అంతేకాకుండా గ్రామ పంచాయితీ నూతన భవనం నిర్మాణం కొరకు రూ.24లక్షలను మంజూరు చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా కొన్ని తాండలకు బీటీ రోడ్ల కోసం రూ.నాలుగు కోట్ల ఇరవై ఐదు లక్షలు మంజూరు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ శోభ నాగభూషణం, తిర్మల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సాయిరాం, మండలాధ్యక్షులు విజయ్ దేశాయి, ఖండేరావ్ పటేల్, బాబు దేశాయి, యువజన నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ సర్పంచుకు పరామర్శ..

మద్నూర్ : డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ మధుకర్ పటేల్ మూడు రోజుల క్రితం బైక్‌పై వెళ్తుండగా దారిలో ప్రమాదం జరిగి గాయపడ్డారు. దీంతో సర్పంచ్ మధుకర్ పటేల్‌ను జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే లింబూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించి ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డొంగ్లి టీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పండిత్‌రావు పటేల్, మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు బసవంతరావు పటేల్ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ.

మాజీ ఎంపీపీ భీమ్రావు పటేల్ గుండెపోటుతో అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే మంగళవారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ భీమ్రావు పటేల్ ప్రతి ఒక్కరిలో మంచి వ్యక్తిగా స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.

నిజాన్ని నిర్భయంగా రాసేపత్రిక.. నవతెలంగాణ

- క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే హనుమంత్‌షిండే

నిజాన్ని నిర్భయంగా రాసేపత్రిక.. నవతెలంగాణ దినపత్రిక అని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే అన్నారు. మంగళవారం మండలంలోని కాస్తలాబాద్ గ్రామంలో నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవతెలంగాణ పత్రిక నిజాన్ని నిర్భయంగా రాసి ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల ముందుంచి ఆ సమస్యను పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శోభ, సర్పంచ్ తిరుమలరెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, ఎంపీటీసీ సాయిలు, సంగప్పదేశాయ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారికి ఐదేండ్ల జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన రమేష్ కుమార్‌పై అతని భార్య సంధ్య, చెక్కిక్యాంపునకు చెందిన ప్రభుదాస్ 2019 మార్చి 19న రమేష్ కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడగా మంగళవారం బోధన్ న్యాయస్థానంలోని అసిస్టెంట్ సెషన్ జడ్జి నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ బోధన్ అసిస్టెంట్ సెషన్ జడ్జి దేవాన్ అజయ్‌కుమార్ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. తేదీ 20-03-2019న పట్టణంలోని ఆజంగంజ్‌కు చెందిన కానుగాలవార్ రమేష్‌కుమార్ గతంలో మిషన్ భగీరథలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించారు. 2000 సంవత్సరంలో సదాశివనగర్ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన సంధ్యతో వివాహం కాగా ఆయనకు 13 సంవత్సరాల కూతురు సంకీర్తన ఉన్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం రమేష్ బైక్‌పై నుంచి కింద పడగా ఎడమకాలు మోకాలు వద్ద ఎముక విరగడంతో వైద్యులు రాడ్డు వేశారు. ఆ సమయంలో చెక్కి క్యాంపునకు చెందిన రమేష్ స్నేహితుడు ప్రభుదాస్ తరుచుగా స్నేహితుడని పరామర్శించడానికి వచ్చేవాడు. దాంతో రమేష్ భార్య సంధ్యతో ప్రభుదాస్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో గత 4 నెలల క్రితం రమేష్‌కు రాడ్ వేసిన భాగంలో గడ్డ అయి ఇన్ఫెక్షన్ అయింది. అప్పటి నుంచి ప్రభుదాసు రమేష్ కుమార్ భార్యతో మరి ఎక్కువగా సన్నిహితంగా ఉండగా అతనిని రమేష్ మందలించాడు. నిందితుడు ప్రభుదాసు రమేష్ ఇంటికి రావడం మానుకున్నాడు. రమేష్ అనారోగ్యం బారిన పడడంతో అతని భార్య సంధ్య 2019 మార్చి 6న నిజామాబాద్‌లోని మనోరమ హాస్పిటల్‌లో చేర్పించింది. రమేష్ కుమార్ హాస్పిటల్‌లో ఉండగా నిందితుడు ప్రభుదాస్ రమేష్‌కుమార్ భార్య కోసం ఆసుపత్రికి వచ్చి వెళ్లేవాడు. ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత రమేష్ తన భార్య సంధ్యను నిందితుడు ప్రభుదాస్ హాస్పిటల్‌కు ఎందుకు వచ్చాడని గట్టిగా ప్రశ్నించాడు. ఇది మనసులో పెట్టుకున్న ఆమె తేదీ 2019 మార్చి 19న రాత్రి 9:30 గంటల సమయంలో రమేష్ మంచంపై అతని భార్య సంధ్య బయట హాల్‌లో మంచం కింద పడుకున్నారు. ఆరోజు మధ్యరాత్రి 12:30 గంటలకు రమేష్ భార్య సంధ్య రమేష్ కాళ్లు గట్టిగా పట్టుకోగా అతనికి మెలకువ వచ్చి చూసేసరికి నిందితుడు ప్రభుదాస్ రమేష్ చాతిపై కూర్చొని నోరు మూసి గొంతు గట్టిగా నొక్కుతున్నాడు. రమేష్ కుమార్ చేసే అరుపులకు అతని కూతురు కీర్తన, అత్త చంద్రవ్వ రావడంతో రమేష్‌ను వదిలిపెట్టారు. అతనిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి బోధన్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన ప్రకారం అప్పటి ఎస్ఐ మూడ్ అంబురియా నాయక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు 10 మందిని సాక్షులుగా ప్రవేశపెట్టి విచారించగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పి.సమ్మయ్య, మంగళవారం బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ దేవాన్ అజయ్ కుమార్ కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితులైన తప్పెట్ల ప్రభుదాస్, సంధ్యకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 100 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పి.సమ్మయ్య బోధన్ పోలీస్ లైజనింగ్ ఆఫీసర్ శంకర్, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మణ్ సహకరించారని కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శంకర్ తెలిపారు.

కుసుమ పంటలో నూనెశాతం పెంచేందుకు

తగు చర్యలు తీసుకోవాలి

- ఏవో నవీన్‌కుమార్

నవతెలంగాణ-జుక్కల్


పంటను పరిశీలిస్తున్న ఏవో నవీన్‌కుమార్

కుసుమ పంటలో నూనె శాతం పెంచడానికి రైతులు తగు చర్యలు తీసుకోవాలని జుక్కల్ మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దోస్పల్లి గ్రామంలో సర్పంచ్ సునీతా పటేల్‌తో కలిసి రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. గ్రామంలో వివిధ పంట సాగు చేస్తున్న వివరాలు సేకరించడంలో భాగంగా కుసుమ పంటకు సోకే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూనెశాతం పెంచేందుకు రైతులకు అవగాహన, రసం పీల్చే పురుగులకు నివారణ, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, జేపీఎస్ జాదవ్ మనోహర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణంలోకి బస్సులు రావాలి

- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకుల సంఘం డిమాండ్

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి ఎడపల్లి మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ రోడ్డు ప్రయాణం ప్రాంగణంలోకి బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ డిపో మేనేజర్ శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎడపల్లి గ్రామపంచాయతీ స్థలాన్ని ఉచితంగా ఆర్టీసీ బస్టాండు నిర్మాణం కొరకు గ్రామస్తులందరం కలిసి ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1988 సంవత్సరంలో బస్టాండ్ నిర్మించారని, అప్పటి నుంచి స్కూల్ విద్యార్థులు, మహిళలు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. భారత ప్రగశీల రైతు సంఘం జిల్లా నాయకులు, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ డివిజన్ కార్యదర్శి షేక్ నసీర్, సుదర్శన్, హనుమాన్లు, రెంజల్ చిన్నపోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

వారసంతతో 'ఎల్లారెడ్డిపల్లి' పేరు తేవాలి

- జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వారసంతను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

వారసంతతో ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని, వ్యాపారులు, ప్ర జలకు రాహదరికి అనుకుని వారాంతపు సంత మొదలు కావడం హర్షణీయమని జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందల్‌వాయి ధర్పల్లి, బీమ్ గల్ రాహదరికి అనుకుని భారత్ మాత వద్ద వారాంతపు సంతను మంగళవారం అయన ముఖ్య అతిథిగా హాజరై ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, సర్పంచ్ జి నరేష్, ఎంపిటిసి బాబు రావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ జి నరేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి కట్టుగా ఒక మంచి నిర్ణయం తీసుకుని గ్రామస్తులకు చుట్టుపక్కల గ్రామాల ప్రజ లకు, వ్యాపారుల కోసం వారాంతపు సంత నిర్వహించడం అభినందనీయమన్నారు. సంతకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని బాజిరెడ్డి జగన్ మోహన్ హామీనిచ్చారు. అనంతరం కూరగాయలు కొనుగోలు చేశారు. అంతకు ముందు భారత్ మాతా విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివెరి గంగాదాస్,ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు నాయిడి రాజన్న,డీకోండ సుదిర్,రాజు నాయక్, అరటి రఘు,బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త పులి సాగర్,సొసైటి డైరెక్టర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-భిక్కనూర్

మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో అనంతరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ.. మండలం నుంచి 81 మైనార్టీ రుణాలకు దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 2 లక్షలు ఒక యూనిట్, ఒక లక్ష 2 యూనిట్లు అర్హులైన వారిని ఎంపిక చేసి ఇవ్వనున్నట్టు తెలిపారు. త్వరలోనే బ్యాంకు మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు వివరించారు.

ఎంబీబీస్‌లో సీటు సాధించిన పేద విద్యార్థినికి రూ.20వేల ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానిపేట్ గ్రామానికి చెందిన గర్నె రసజ్ఞ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఈమెది నిరుపేద కుటుంబం కావడంతో మండల కేంద్రానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త, నీటిపారుదల శాఖ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ మోయిన్ హమ్మద్ ఖాద్రి రూ.20వేల ఆర్థిక సహాయం పంపగా.. రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్, ఎంపీడీఓ మల్లికార్జున్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, ఉపసర్పంచ్ కౌడ రవి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నరేష్, రమేష్, లక్ష్మీనారాయణ విద్యార్థిని తండ్రి సంగయ్య పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయి రుణాలు చెల్లించని వారిపై చర్యలు

నవతెలంగాణ-జుక్కల్

స్త్రీనిధి బకాయి రుణాలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జుక్కల్ ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం స్త్రీనిధి రుణాలను 30 గ్రామ సంఘాలకు సుమారుగా రెండున్నర కోట్ల రూపాయలు అందజేశామని, 98శాతం గ్రూపులకు పంపిణీ చేశామని తెలిపారు. రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లించాలన్నారు.

ఎంపీడీవోను సన్మానించిన ఎంపీటీసీలు

నవతెలంగాణ-లింగంపేట్

మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్‌రెడ్డిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు శాలువా కప్పి మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రూప్ సింగ్, విట్టల్ నాయక్, గన్నునాయక్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట్ మండలంలోని లింగంపేట్, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్, బీజేపీ పార్టీ సీనియర్, యూత్ నాయకులు కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. వీరికి ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అక్రమ మొరం టిప్పర్ల పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు జేసీబీలు, 7 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు రెంజల్ ఎస్ఐ వంఢ్ల సాయన్న తెలిపారు. పక్క సమాచారం మేరకు తహసీల్దార్ రామచందర్, మైన్స్ అధికారులు, పోలీసులు కలిసి ఆ టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసి వాహనాలను తహసీల్దార్ ఆధీనంలో ఉంచినట్టు ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న శుభ సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పండిత్ పవన్, ప్రేమ్ ,కాందేశ్ శ్రీనివాస్, అయ్యప్ప శ్రీనివాస్, ఇట్టే డి నర్సారెడ్డి, పి ప్రీ, ఆలూరు, పెర్కిట్, గోవింద్ పెట్ సొసైటీల చైర్మన్లు సోమ హే మంత్ రెడ్డి, కళ్లెం బొజారెడ్డి, పెంట బొజారెడ్డి, బంటు మహిపాల్ మండలంలోని సర్పంచులు ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం సరోజ గంగారెడ్డి, బండమీది జమున గంగాధర్, కళ్లెం మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ రాజకీయాల్లో మరింత ముందుకు దూసుకెళ్లాలని కోరారు.

మేరు కులస్తులందరూ కలిసికట్టుగా ఉండాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మేరు కులస్తులందరూ కలిసికట్టుగా ఉండి సంఘ అభివృద్ధికి పాటుపడాలని మేరు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సోమ హన్మంత్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మేరు సంఘం భవనంలో సమావేశమై మేరు కులస్తుల సమస్యలపై, వారి అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. అనంతరం మేరు సంఘం మండల కమిటీని సోమహన్మంత్ రావు ప్రకటించారు. మండల అధ్యక్షులుగా వరగంటి మోహన్, ప్రధాన కార్యదర్శిగా కర్నె హరీష్, కోశాధికారిగా వాదపల్లి సునీల్, ఉపాధ్యక్షులుగా పోల్కం నవీన్ కుమార్, పోల్కం కపిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కొట్టూర్ చంద్రకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కొట్టూర్ రాజు, నిజామాబాద్ నగర అధ్యక్షులు మంతెన, దశరథ్, మేరు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును వినియోగించుకోవాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు
- రెండో విడత కంటివెలుగుపై అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శారదా నాగరాజు, ఎంపీడీఓ చిన్నారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కంటి వెలుగు కార్యాక్రమాన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో 100 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యాక్రమంలో కంటికి సంబంధించిన అన్నీ రకాల చికిత్సలు చేయనున్నట్టు వివరించారు. అన్నీ పరికరాలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, తహసీల్దార్ శాంతా, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీవో తిరుపతి, ఎస్ఐ సుధాకర్, ఎంపీటీసీలు కడారి రమేష్, నిమ్మ శంకర్, దోర్నాల లక్ష్మి లక్ష్మణ్, కోఆప్షన్ శమి, సర్పంచ్‌లు ఎండీ సలీం, జాలిగామ నాంపల్లి, సాయిలు, సార్ల నర్సవ్వ, నరేశ్, బురాణి సమత, స్వరూప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోధన్ : బోధన్ డివిజన్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బోధన్ ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య అన్నారు. మంగళవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బోధన్ డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో 18 ఏండ్ల వయస్సు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు చేయాలని ఆమె సూచించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలకు గాను 18 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏఈ శ్రీనివాస్, సూపర్ వైజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : కంటివెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి : ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాప్రతినిధులు అందరూ ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ చైర్మెన్ కుడుములు సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కంటి వెలుగుపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ట్రెయినీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్, మున్సిపల్ వైస్‌చైర్మెన్ సుజాత, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

జుక్కల్ : రెండో విడత కంటి వెలుగుకు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యుడు పండరి అన్నారు. ఎంపీడీవో సమావేశపు హాలులో ప్రజాప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎడపల్లి : సమిష్టి కృషితోనే కంటివెలుగు సంపూర్ణ విజయవంతం అవుతుందని ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎడపల్లి, కుర్నాపల్లి రెండు గ్రామాలలో అధికారికంగా కంటి వెలుగు పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు.

రాజంపేట్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమంపై ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు హెల్త్ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించినట్టు ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని, అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీడీవో బాలకిషన్ మాట్లాడుతూ.. గ్రామాలలో కంటి వెలుగు జరుగు సమయంలో మెడికల్ సిబ్బందికి క్యాంపు నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు గ్రామాలలో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సహాయ సహకారాలు, వసతి, భోజనం ఏర్పాట్లు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండా హనుమన్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, హెల్త్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలంలోని పెద్ద మల్లారెడ్డి సర్పంచ్ సత్తురి లక్ష్మి రాజలింగం సూచించారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు, ఆరోగ్య సిబ్బందికి వైద్యులు అవగాహన కల్పించారు. ఈ నెల 19వ నుంచి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలగోని రాజాగౌడ్, ఎంపీటీసీలు సాయగౌడ్, మంజుల రాములు, ఆశా కార్యకర్తలు, గ్రామ వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెంజల్ : ఈనెల 19 నుంచి ఫిబ్రవరి 20 వరకు మొదటి విడతగా జరిగే కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఎంపీడీవో శంకర్, డాక్టర్ వినయ్‌కుమార్, ఎంపీఓ గౌసుద్దీన్, హెచ్‌ఈఓ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రతిరోజు పరీక్షలు చేయనున్నట్టు సర్పంచ్ రమేష్ కుమార్ తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునేవారు టోకెన్లు తీసుకొని రావలసిందిగా ఆయన కోరారు. వారి వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాజేందర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్ని : మండలంలోని తగిలిపల్లి గ్రామంలో మండల స్పెషల్ అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, సర్పంచ్, వైద్య శాఖ అధికారులు కంటివెలుగుపై సమావేశం నిర్వహించారు.

లింగంపేట్ : కంటి వెలుగు కార్యక్రమంపై సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, మండల వైద్యాధికారి హిమబిందు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఉప సర్పంచ్ కౌడ రవీందర్, వార్డు సభ్యులు రమేష్, లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియొద్దిన్, టీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ నరేష్, టీఆర్ఎస్ నాయకులు జొన్నల రాజు, మంగలి రమేష్, చింతల సాయిలు, సీహెచ్‌ఓ రమేష్, ఐకేపీ సీసీ మెహర్, ఏఎన్ఎం రాజేశ్వరి, ఐకేపీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

వేముల రోహిత్‌కు నివాళులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వేముల రోహిత్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన రోహిత్ వేముల ఏడవ వర్ధంతి సందర్భంగాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ ఉపాధ్యక్షులు నరసయ్య ఆధ్వర్యంలో రోహిత్ వేముల చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ క్యాంపస్‌లో మతోన్మాద శక్తులు వేముల రోహిత్‌ను వెంబడించి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమయ్యారని అన్నారు. మతోన్మాదులవల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై పోరాటాలు సాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, కృష్ణ, సాయిలు, రాజు, గోవర్ధన్, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేతలుగా జిల్లా జట్లు

అభినందించిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

61వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో నిజామాబాద్ జిల్లా బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు క్రీడాకారులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అభినందించారు. ఈనెల 12 నుండి 14 వరకు ఖమ్మం జిల్లా బోనకల్లులో జరిగిన 67వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాపోటీల్లో ఛాంపియన్స్‌గా నిలిచిన నిజామాబాద్ బాలుర జట్టును ద్వితీయ స్థానంలో నిలిచిన బాలికల జట్టును అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ జిల్లా సంఘ వారిని అభినందించారు. పోలీసు ఉద్యోగాల్లో చేరి ప్రజలకు సేవలు అందించాలని క్రీడాకారులకు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ సంఘం ఉపాధ్యక్షులు రంజిత్ సింగ్ , ప్రధాన కార్యదర్శి శ్యామ్, కోశాధికారి రాజేశ్వర్,నిర్వాణ కార్యదర్శి కృష్ణమూర్తి,వినోద్, జోష్ణ, ప్రదీప్,సీనియర్ క్రీడాకారులు కార్తీక్,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సెక్రెటరీకి సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గ్రామంలో పన్నుల వసూళా 100 శాతం చేపట్టడంతో శ్రీనగర్ జీపీ సెక్రటరీ సందీప్‌ను అధికారులు సన్మానించారు. మంగళవారమిక్కడ కార్యదర్శి సందీప్‌కు ఎంపీడీవో మల్లేశ్, ఎంపీవో మధురిమ శాలువ కప్పి సన్మానించి, మెమొంటో అందజేశారు. ఉత్తమ పనితీరు కనబరిచి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించారు.



సెక్రెటరీని సన్మానిస్తున్న అధికారులు

ఎంపీపీ భర్తకు పలువురి పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

దాడికి గురైన ముప్కాల్ ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధుడిపై ఇలా దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. పరామర్శించిన వారిలో తహశీల్దార్ విక్రమ్, ఎంపీడీవో దామోదర్, ఎంపీవో భరత్ చంద్ర, వ్యవసాయాధికారి రాజ్ కుమార్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, కో ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగంపేట్ ముత్తెన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ, మండల అధికారులు ఉన్నారు.

నేటిసభనుండి హామీల అమలను ప్రారంభించాలి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి సీపీఐ బహిరంగ లేఖ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ రాశారు. దీన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ రైతాంగానికి ఒక లక్ష రూపాయలు ఒకేసారి రుణమాఫీ చేస్తామని, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కేసీఆర్ హామీనిచ్చారన్నారు. కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని అన్నారని తెలిపారు. దళితులకు మూడు ఎకరాల భూమి పేదలకు భూ పంపిణీ చేస్తామని, ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని, అందరికీ తెల్ల రేషన్ కార్డు ఇస్తామని, 57 సంవత్సరాలు దాటిన వారికి, వృద్ధులకు పెన్షన్ ఇస్తామని ఇలా ఎన్నో ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజలకు హామీలను ఇచ్చారన్నారు. వీటిని ఈనెల18న ఖమ్మంలో జరిగే చారిత్రాత్మక సభ నుండి ప్రారంభించి అమలు పరచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎండి.రఫిక్ ఖాన్, రఘురాం, అంజలి, నాయకులు అమర్, గంగాసాగర్ పాల్గొన్నారు.

సీఏ, గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కు చెందిన దుగ్గి శ్రీనివాస్, దుగ్గి సుజాతల కూతురు గౌతమి సీఏ పూర్తి చేయడంతో మంగళవారం జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. సీఏలో 50.8శాతంతో పాస్ కావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలతో విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, జిల్లా దేవాంగ విద్యా కమిటీ సభ్యులు వినాయక్, రఘునాథ్, చంద్రమోహన్ ,రాము, భూమేశ్వర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-1ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినికి సన్మానం



గౌతమిని సన్మానిస్తున్న దేవాంగ విద్యాకమిటీ

పట్టణంలోని రెండవ వార్డు పరిధిలో గల జిరాయత్ నగర్ లో నివసించే క్షత్రియ సమాజ్ కు చెందిన జనార్దన్ స్వాతి ఇటీవల గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు అయిన సందర్భంగా కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ ఆమెకు శాలువా పూల మాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ జనార్దన్ స్వాతి, మోహన్ గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు కావడం క్షత్రియ సమాజ్ కు గర్వకారణమన్నారు. సమాజ్ అధ్యక్షులు మదన్ మోహన్, కార్యదర్శి గంగా మోహన్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి ప్రాంతీయ సమాజ్ ద్వారా ప్రోత్సాహం లభించేలా కృషి చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, స్థానికులు, వారి కుటుంభ సభ్యులు పాల్గొన్నారు.

పసుపు బోర్డును వెంటనే ప్రకటించాలి

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

నవ తెలంగాణ-ఆర్మూర్

పసుపు క్వింటాలుకు రూ. 15వేలు మద్దతు ధర ప్రకటించి మార్కెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, పసువు బోర్డుని వెంటనే ప్రకటించాలని డివిజన్ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్.. రైతు జేఏసీ నాయకులు యాద గౌడ్ మాట్లాడుతూ...ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా,, నిర్మల్ జిల్లాల పరిధిలో సుమారు 80 వేలకుపైగా సాగు చేయబడుతుంది... పసుపు సాగు ఖర్చు రోజు రోజుకు పెరిగి లక్ష యాభై వేల రూపాయలు ఎకరాన అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపు బోర్డు సాధన కొరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని పసుపంట ఎంఎస్పి లిస్టులో చేర్చాలని, మద్దతు ప్రకటించాలని కేంద్రానికి ప్రతిపాదన పంపాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పార్లమెంట్ సభ్యులు అరవింద్ తాను గెలవగానే తాను పసుపు బోర్డు సాధించి పెడతానని వంద రూపాయల బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చి రైతుల్ని మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు బోర్డును వచ్చే పార్లమెంటు ఎన్నికలకు ముందే ప్రకటించకపోతే గత పార్లమెంట్ సభ్యురాలికి చెప్పిన గుణపాఠంబిజెపి అభ్యర్థులకు చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు పిట్ట గంగారాం (మంతెన), బి దేవారం, జక్కం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యూబా సంఘీభావ సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

క్యూబా సంఘీభావ సభను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, పి.డి.ఎస్.యు. నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ...ప్రపంచ విప్లవకారుడు చేగువేరా కూమార్తె డాక్టర్ అలైద గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఎస్తిఫిన గువేరా ఈనెల 22 న హైదరాబాద్ కి వస్తున్నారని, రవీంద్ర భారతి ఆడిటోరియంలో సభని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చేగువేరా సామ్రాజ్యవాదం, దోపిడి పీడనలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రపంచ విప్లవకారుడుని కొనియాడారు. మనుషులుగా జీవించే ఒక సమ సమాజ స్థాపనకై, పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని తెలిపారు. అర్జెంటీనాలో జన్మించి, ఎంబిబిఎస్ పట్టా పొంది క్యూబాలో విప్లవం వచ్చే విధంగా కృషి చేసిన మహోన్నత ప్రపంచ విప్లవకారుడు చేగువేరా అని కొనియాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జ్వాల, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్.కే. అశుర్, మారుతి పాల్గొన్నారు.

18 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గ్రామపంచాయతీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి అని రాష్ట్ర అధ్యక్షులు దాసు అన్నారు. నగరంలోని పోచమ్మ గల్లీలో ముదిరాజ్ సంఘంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రగతిశీల (ఐఎఫ్‌టీయూ) గ్రామపంచాయతీ రాష్ట్ర మహాసభలను ఫిబ్రవరి 5న జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు పని భారం పెరుగుతుందని, 8 గంటల పని విధానాన్ని యధా విధంగా కొనసాగించాలని అన్నారు. పంచాయతీ కార్మికులందరికీ పీఎఫ్ ,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని, 30 శాతం పిఆర్సిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభల కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు జేపీ గంగాధర్, భానుచందర్, నారాయణ, రాజన్న, నవీన్, రమేష్, గంగ సాయిలు, భూమన్న, ఎస్ శ్రీనివాస్, పోశెట్టి, ఐనార్ల సాయమ్మ భూలక్ష్మి, నాగమణి, పద్మ, చిట్టిబాబు, మోహన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు